సాక్షి
కామారెడ్డి
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



'ప్రగతి'.. అధోగతి
పట్టణ ప్రగతి కార్యక్రమానికి నిధులు మంజూరు కావడం లేదు. దీంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది.
- 8లో ▸



ఉద్యోగాల పేరిట మోసం
ఉద్యోగం పేరిట యువతకు గాలం వేసి, ఆన్‌లైన్ ద్వారా గొలుసు దందా నడిపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /17.5

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

16 న ఉద్యోగ మేళా

కామారెడ్డి క్రైం: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం ఈనెల 16 న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కామారెడ్డిలలోని అపోలో ఫార్మసీలలో ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం ఈ మేళా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపువారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 16న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని 121 వ గదిలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకోసం 72079 17714, 79953 89260, 98482 37987, 99899 67088 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేషనల్ మ్యాథ్స్ వర్క్‌షాప్‌నకు ఎంపిక



కామారెడ్డి రూరల్: గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీలో ఈనెల 17 తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి గణిత వర్క్‌షాప్‌నకు జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. రెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్ గణిత ఉపాధ్యాయుడు డి.మనోహర్, చిన్న మల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ గణిత ఉపాధ్యాయుడు వి.రామకృష్ణ, గోపాల్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్ గణిత ఉపాధ్యాయుడు కె.రాఘవేందర్‌రావు వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. గణితంలో అనుభవ పూర్వక అభ్యసనం అనే అంశంపై శిక్షణ పొందనున్నట్లు వీరు తెలిపారు. వీరిని డీఈవో రాజు, రాష్ట్ర గణిత ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి రామారావు, కోశాధికారి నరేందర్ అభినందించారు.

24 నుంచి టెక్నికల్ కోర్సుల పరీక్షలు

కామారెడ్డి క్రైం: టెక్నికల్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులకు సంబంధించి శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు ఈనెల 24 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. టెక్నికల్ కోర్సులకు సంబంధించి లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈ నెల 24 నుంచి 27 వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈ నెల 24 నుంచి 27 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈనెల 25 నుంచి 27 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం జరిగిన పరీక్షకు 152 మంది విద్యార్థులకుగాను 142 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 163 మందికిగాను 152 మంది విద్యార్థులే పరీక్ష రాశారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.


'మంచి ఫలితాలు సాధించాలి'



దోమకొండ: విద్యార్థులు వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం ఆయన సీతారాంపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పిల్లలకు మోనూ ప్రకారం భోజనం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జీసీడీవో ఉమారాణి, ఎంఈవో ఎల్లయ్య, స్పెషల్ ఆఫీసర్ మమత తదితరులు పాల్గొన్నారు.

మనసున మనసై..

- ప్రేమించి, పెళ్లికి పెద్దలను ఒప్పించి..
- జీవితంలో నిలదొక్కుకున్న పలుజంటలు
- నేడు ప్రేమికుల దినోత్సవం



రెండక్షరాల కలయిక ప్రేమ. రెండు హృదయాలను ఏకం చేసేది ప్రేమ. దానిని పెళ్లి వరకు తీసుకువెళ్లి జీవితాంతం కష్టసుఖాలను పంచుకుంటూ తోడు నీడగా జీవించగలిగితేనే ఆ ప్రేమకు సార్థకత. కులమతాలు వేరైనా మనసులు కలిసిన వేళ.. ప్రేమే పరమావధిగా భావించి, ఇద్దరూ ఒక్కటై నీకు నేను.. నాకు నీవు.. ఒకరికొకరం.. నువ్వూ నేనూ అంటూ అన్యోన్యంగా జీవనం సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు. ప్రేమించి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని, జీవన నావను సాఫీగా ఈదుతూ పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– సాక్షి, కామారెడ్డి

ఎల్లలు దాటిన ప్రేమ



రవీందర్, చారుక

మాచారెడ్డి: అక్కాపూర్ గ్రామానికి చెందిన అరిగె రవీందర్ బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ ఆయన పనిచేసే కంపెనీలో శ్రీలంకకు చెందిన రూషాని చారుక అనే యువతి పరిచయమైంది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. అది ప్రేమ వరకు వెళ్లింది. ఇరువురూ తమ తల్లిదండ్రులు ఒప్పించి, 2015 జనవరి 26న అక్కాపూర్ గ్రామంలో సంప్రదాయబద్ధంగా ఒక్కటయ్యారు. వారికిప్పుడు ఇద్దరు కుమారులు. ఇరు కుటుంబాల అండతో వాళ్ల సంసార జీవితం సాఫీగా నడుస్తోంది. ఇద్దరి భాష, సంస్కృతులు వేరైనా ఒకరినొకరం అర్థం చేసుకోవడంతో ఏ ఇబ్బందీ తలెత్తలేదని రవీందర్ పేర్కొంటారు.

పెద్దలను ఒప్పించి, ఒక్కటై..



రెంజర్ల శ్రీనివాస్, దీప

కామారెడ్డి టౌన్: నిజామాబాద్ నగరానికి చెందిన రెంజర్ల శ్రీనివాస్, దీప ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. అయితే దీప, శ్రీనివాస్‌లు పట్టువదలకుండా ప్రయత్నించి, పెద్దలను ఒప్పించి 2009 జనవరి 23న పెళ్లి చేసుకున్నారు. వీరికి నలుగురు పిల్లలు. శ్రీనివాస్ కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత దీప చదువుకోవాలనుకోవడంతో శ్రీనివాస్ ప్రోత్సహించాడు. ఆమె నర్సింగ్ కోర్సు పూర్తి చేసింది. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగంలో చేరింది. ఒకరినొకరం అర్థం చేసుకుని ముందుకు సాగుతున్నామని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఒకరికి ఒకరై.. ఒకటిగ సాగుతూ..



శారద, శంకర్

ఎల్లారెడ్డి: దివ్యాంగులిద్దరూ మనసిచ్చుకున్నారు. పెద్దలు వీరి వివాహం జరిపించడానికి ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయించి, గుళ్లో పెళ్లి చేసుకున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా సీజనల్ వ్యాపారాలు చేసుకుంటూ ఆదర్శంగా ముందుకు సాగుతున్నారు ఎల్లారెడ్డి మండలం బాలాజీనగర్ తండాకు చెందిన కాట్రోత్ శంకర్, శారద దంపతులు. బాలాజీనగర్ తండాకు చెందిన కాట్రోత్ శంకర్‌కు పుట్టుకతోనే రెండుకాళ్లు చచ్చుబడిపోయాయి. నిలబడడానికి కూడా కాళ్లు సహకరించకపోయినా ఇంటర్ వరకు చదివాడు. 2008లో బంధువుల పెళ్లికి మెదక్ జిల్లా కొడిపల్లి మండలం భట్టునాయక్ తండాకు వెళ్లిన శంకర్‌కు.. అక్కడ తనలాగే వైకల్యంతో బాధపడుతున్న శారద కనిపించింది. ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. అది కాస్తా ప్రేమగా మారింది. వైకల్యంతో బాధపడుతున్న వీరిద్దరు పెళ్లి చేసుకుంటే ఎలా బతుకుతారని ఆందోళన చెందిన ఇరువురి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో 2010లో శారద, శంకర్‌లు పోలీసులను ఆశ్రయించి, ఎల్లారెడ్డి సాయిబాబా మందిరంలో పెళ్లి చేసుకున్నారు. తండాలోనే నివసిస్తూ ఊరూరా తిరుగుతూ ఇడ్లీలు, ఐస్‌క్రీమ్‌లు అమ్ముతూ ఉపాధి పొందారు. కాళ్లు లేకున్నా ఆత్మ విశ్వాసంతో జీవితంలో ముందుకు సాగుతున్న వీరి గురించి 'సాక్షి' నాలుగేళ్ల క్రితం 'సాక్షి'లో 'ఒకరికి ఒకరు ఊతమిచ్చుకున్నారు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన అప్పటి కలెక్టర్ శరత్.. తక్షణం ప్రభుత్వం తరఫున లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ డబ్బులతో తండాలో కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. శారద దుకాణాన్ని నిర్వహిస్తుండగా.. శంకర్ సీజనల్ వ్యాపారాలు చేస్తున్నాడు. తమ మధ్య ఎప్పుడూ ఎలాంటి గొడవ జరగలేదని, రోజురోజుకు ప్రేమ పెరిగిందే తప్ప తరగలేదని వారిద్దరూ పేర్కొంటున్నారు.

జైలు పాలైనా.. మారని మనసు



చందాపురం జ్యోతి, రాజు

కామారెడ్డి టౌన్: వారిద్దరూ ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రేమికుడిపై కేసు నమోదయ్యింది. 14 రోజులు కటకటాల వెనక గడపాల్సి వచ్చినా అతడు ప్రేమను వదులుకోలేదు. కొంతకాలానికి ప్రేమించిన యువతినే పెళ్లాడి ఆదర్శంగా నిలిచారు జిల్లా కేంద్రానికి చెందిన ఏఎస్సై చందాపురం రాజు. ఆయన 1990లలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో జ్యోతి అనే యువతిని ప్రేమించాడు. ఇద్దరి మనసులు కలిశాయి. అయితే కులాలు వేరు కావడంతో వీరి ప్రేమను పెద్దలు ఒప్పుకోలేదు. జ్యోతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాజుపై కేసు నమోదు చేసి, సస్పెండ్ చేశారు. 14 రోజులపాటు జైలులో ఉండాల్సి వచ్చింది. అయినా ప్రేమను వదులుకోలేదు. పెద్దలు అంగీకరించకపోవడంతో జ్యోతి, రాజు 1993లో కులాంతర వివాహం చేసుకున్నారు. అప్పట్లో నిజామాబాద్ ఎస్పీగా ఉన్న ప్రస్తుత టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, అప్పటి మంత్రి డి.శ్రీనివాస్‌ల సమక్షంలో మాధవనగర్‌లోని సాయిబాబా ఆలయంలో వివాహం జరిగిందని రాజు తెలిపారు. పెళ్లయిన ఏడాదికే విధి నిర్వహణలో అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వెంట ఉండగా జరిగిన బాంబ్ బ్లాస్ట్‌లో తీవ్ర గాయాలపాలయ్యానని, సుమారు రెండున్నరేళ్లపాటు తన భార్యే ఓపికగా సేవలు చేసి బతికించుకుందని పేర్కొన్నారు. మొదట్లో పెళ్లికి అంగీకరించని పెద్దలు తర్వాత మనసు మార్చుకున్నారన్నారు. తమకు ఇద్దరు పిల్లలని, వారికి వివాహమైందని, మనవలు, మనవరాళ్లతో సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా అన్యోన్యంగా జీవితాన్ని గడుపుతున్నామన్నారు.

బడా రాంమఠ్ భూముల కబ్జాపై కలెక్టర్ ఆరా

నిజామాబాద్‌సిటీ: జిల్లా కేంద్రంలోని బడా రాంమఠ్ (గాజుల్‌పేట్)కు చెందిన భూముల కబ్జాపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆరా తీశారు. మంగళవారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియను వివరాలు అడిగారు. మఠానికి చెందిన భూములు రికార్డుల్లో ఎన్ని ఎకరాలు ఉన్నాయి.. ఎంత కౌలుకు ఇచ్చారని ప్రశ్నించారు. మఠం కింద నిజామాబాద్‌లో 200 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 117 ఎకరాలు, నాందేడ్(మహారాష్ట్ర)లో 183 ఎకరాల భూమి ఉన్నాయని కలెక్టర్‌కు వివరించినట్లు ఏసీ తెలిపారు. కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను సహాయ కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో వివిధ మండలాల్లో మఠం భూములు ఉండగా, వాటిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 400 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ఈ భూముల లెక్క పూర్తిగా తేలే సర్వే ఆపకూడదని దేవాదాయ శాఖ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. మఠం మేనేజర్ విజయ్‌కుమార్, సహాయ మేనేజర్ సురేష్ కుమార్ కౌలు డబ్బులు, ఆలయాలకు వచ్చిన ఆదాయం బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయకుండా, లెక్కలు చూపడం లేదని, వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని సుప్రియ కలెక్టర్‌కు తెలిపారు.

ఇంటెలిజెన్స్ దృష్టి..

బడా రాం మఠ్‌కు చెందిన భూముల కబ్జాలపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రాంమందిరానికి చెందిన మొత్తం భూములు ఎన్ని, కౌలుకు ఇచ్చిన భూములు, కబ్జాకు గురైన భూములు, ఆలయాలకు వస్తున్న ఆదాయంపై వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఈ కబ్జాల వెనుక ప్రజాప్రతినిధుల పాత్ర ఉండటంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

280 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం

- ఎస్పీ సింధు శర్మ
- ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు



కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని పీఎస్‌ల పరిధిలో 280 అవగాహన కార్యక్రమాలు చేపట్టామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. జనవరి 15 న ప్రారంభమైన రోడ్డు భద్రత మాసోత్సవాలు మంగళవారం ముగిశాయి. మాసోత్సవాలలో చేపట్టిన కార్యక్రమాలను ఎస్పీ వివరించారు. జిల్లా పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో 35 గ్రామసభలు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రూల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ఎల్లారెడ్డి సబ్ డివిజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 40 యూనిట్ల రక్తాన్ని సేకరించామని పేర్కొన్నారు. 819 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, నంబర్ ప్లేట్ సరిగా లేని 1,466 వాహనాలను గుర్తించి సరి చేయించామని వివరించారు. ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

ఈసీ నిర్ణయాలు అమలయ్యేనా?

- తెలంగాణ యూనివర్సిటీలో ఇంకా గందరగోళమే!
- హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌కు తప్పుడు సమాచారంపై సీరియస్
- చార్జ్ మెమోలు జారీ చేయాలని పాలకమండలి తీర్మానం
- ఇంత జరిగినా కనకయ్యను కీలక పదవిలో కూర్చోబెట్టే ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గత రెండేళ్లకు పైగా అవినీతి, అక్రమాలు, నియామకాల విషయంలో పరువు బజారుపాలైన తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇప్పటికీ గందరగోళం వీడలేదు. పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు, చేసిన తీర్మానాలను అమలు చేసే పరిస్థితి లేకుండా కుట్రలు జరుగుతుండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు రెండేళ్ల కాలంలో 53 నుంచి 63 వరకు పాలకమండలి సమావేశాలు జరిగాయి. అయితే ఈ సమావేశాల్లో ఈసీ తీసుకున్న నిర్ణయాలను, చేసిన తీర్మానాల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోవడం విశేషం. తాజాగా ఈ నెల 7న రాష్ట్ర సచివాలయంలో 63వ పాలకమండలి సమావేశం జరిగింది. వీసీ ఎంపిక కోసం వర్సిటీ నుంచి సెర్చ్ కమిటీ నామినీని ఎంపిక చేశారు. ఈ క్రమంలో మరికొన్ని అంశాలపై చర్చ చేసి తీర్మానాలు చేశారు. ఇందులో కీలకమైన అంశాలపై పాలకమండలి సభ్యులు నిర్ణయాలు తీసుకున్నారు. అయితే పాలకమండలి తీర్మానాలను ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు చేయని నేపథ్యంలో తాజాగా తీసుకున్న నిర్ణయాలను ఏమేరకు అమలు చేస్తారనే విషయమై సందిగ్ధత నెలకొంది. ఈసీ చేసిన తీర్మానాల అమలు సంగతి అటుంచితే అసలు మినిట్స్‌ను యథాతథంగా రాస్తున్నారా ? అనేది ప్రశ్నార్థకంగా తయారైందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. 2021 డిసెంబర్ 21న వర్సిటీ ఈసీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను సైతం ఇప్పటివరకు అమలు చేయలేదు. తరువాత రిజిస్ట్రార్‌గా వచ్చిన శివశంకర్ ఆ దిశగా ప్రయత్నం చేసినప్పటికీ పలు అడ్డంకులు ఎదురయ్యాయి. ఇంత డ్రామా నడిచిన నేపథ్యంలో తాజాగా జరిగిన పాలకమండలి సమావేశంలో కనకయ్యను ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా గానీ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించేందుకు రిజిస్ట్రార్ యాదగిరి ప్రతిపాదన పెట్టగా ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సీరియస్ అయ్యారు. ఈసీ తీర్మానాల అమలు విషయమై యాదగిరిని 'సాక్షి' వివరణ కోరగా ఆలోచించి ముందుకు వెళతామని చెప్పడం గమనార్హం.

■ వివిధ విడతల్లో జరిగిన పాలకమండలి సమావేశాల్లో మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, విద్యావర్ధినిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేయగా.. అమలు చేయకపోవడం గమనార్హం. పైగా ఈసీ సభ్యుల నిర్ణయాలకు వ్యతిరేకంగా ఏడుగురు ప్రోగ్రామర్లకు బదులు 8 మందికి వేతనం పెంచేలా ప్రయత్నం జరగడం విశేషం. ఈ నేపథ్యంలో తాజా ఈసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను యథాప్రకారం పొందుపరుస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

■ తమ అవసరాల కోసం కొందరు ఇంటర్నల్ ఈసీ సభ్యులు ప్రోగ్రామర్స్ విషయంలో రిజిస్ట్రార్ యాదగిరికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదని తెలుస్తోంది. ఇక తాజాగా పాలకమండలి సమావేశంలో.. యూసీజీ నిబంధనలను ఉల్లంఘించి అడ్డదారిలో పదోన్నతి పొందిన ప్రొఫెసర్ కనకయ్య హైకోర్టును తప్పుదోవ పట్టించిన విషయం, ఈ విషయాన్ని అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సైతం సక్రమమేనని హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌కు తప్పుడు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో చర్యలు తీసుకునేందుకు పాలకమండలి నిర్ణయించింది. ఈ క్రమంలో వీళ్లిద్దరికీ చార్జ్ మెమోలు ఇవ్వాలని ఈసీ సభ్యులు తీర్మానించారు. అయితే దీన్ని షోకాజ్ కిందకు మార్చే ప్రయత్నం జరుగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్టాండింగ్ కౌన్సిల్‌కు రిప్రజెంట్ చేసిన విద్యావర్ధిని అప్పటి వైస్ చాన్స్‌లర్ చెప్పమంటేనే చెప్పానని ఒప్పుకోవడం గమనార్హం.

రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్



శాంతి టాకీస్ రోడ్డులో మార్కింగ్ చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ రోడ్డు వరకు రహదారి విస్తరణ కోసం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం రోడ్డుకు ఇరు వైపులా మార్కింగ్ చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రోడ్డు 80 ఫీట్లు ఉండాలి. కానీ ప్రస్తుతం 30 ఫీట్లు కూడా లేదు. ఇటీవల ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఈ మార్గంలోనే ఉన్న తన నివాసాన్ని కూల్చి వేయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీపీవో గిరిధర్ సిబ్బందితో కలిసి రోడ్డుకిరువైపులా 80 ఫీట్ల కోసం కొలతలు తీసి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా టీపీవో మాట్లాడుతూ 20 వేల జనాభా ఉన్న కాలంలో రోడ్డు వేశారన్నారు. ప్రస్తుతం జనాభా లక్షన్నరకు చేరడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమస్య పరిష్కారం కోసం ఈ రోడ్డును వెడల్పు చేయాల్సిందేనని, ప్రజలు సహకరించాలని కోరారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్మాణాలను తొలగించుకోవాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కామారెడ్డి టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సుదీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్లను సీడీఎంఏ అధికారులు బదిలీ చేశారు. కామారెడ్డి కమిషనర్ ఎం.దేవేందర్ మెదక్ జిల్లాలోని రామాయంపేటకు, ఎల్లారెడ్డి కమిషనర్ జె.జగ్జీవన్ సంగారెడ్డి జిల్లాలోని నారాయణ్‌ఖేడ్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. వీరు బుధవారం బదిలీ అయిన స్థానాలలో విధుల్లో చేరనున్నారు. కాగా కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్లుగా ఎవరినీ నియమించలేదు. నికంగా సీనియర్ అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలి

- భూగర్భ జలాలను సంరక్షించాలి
- భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్



మాట్లాడుతున్న ఏడీ సతీష్ యాదవ్

మాచారెడ్డి: ప్రతి వర్షపు నీటి బొట్టునూ ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్ సూచించారు. భూగర్భ జల శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద భూగర్భ జలాల నిర్వహణ, నియంత్రణ, స్థిరమైన అభివృద్ధి అంశాలపై మంగళవారం మాచారెడ్డి మండలం భవానీపేటలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా నీటి ఆవశ్యకత, భూగర్భ జలాల సంరక్షణ, పెంపుదలకు తీసుకోవలసిన పద్ధతులు, వాల్టా చట్టం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మి, జిల్లా పశువైద్యాధికారి సింహారావు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోవధను ప్రోత్సహించే వారిని తరిమికొడదాం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గోవధను ప్రోత్స హించే వారిని తరిమి కొడదామని వీహెచ్‌పీ తెలంగాణ సంఘటన్ నాయకులు యాదిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రామాలయం ఆవరణలో నిర్వహించిన అయోధ్య రామ భక్తుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవాలయాల పునరుద్ధర ణకు పాటు పడుతున్న వారికి మద్దతు ఇవ్వాలని అన్నారు. సోమనాథ్ ఆలయం, అయోధ్యలో రామాలయానికి మద్దతు పలకని వారికి సైతం మద్దతు తెలపవద్దని అన్నారు. హిందుత్వ భావాలు గల మన దేశంపై ఇతర దేశాలు దాడులు చేశాయని, కాని మన దేశం మాత్రం ఏ దేశంపై దాడులకు పాల్పడలేదని అన్నారు. వీహెచ్‌పీ నాయకులు తమ్మల కృష్ణ, బొల్లి రాజు, నవీన్, వినోద్ తదితరులున్నారు.

తండాల అభివృద్ధికి కృషి చేస్తాం



రామారెడ్డి(ఎల్లారెడ్డి): మారుమూల తండాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తామని జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం జగదాంబ తండా జీపీ పరిధిలోని పకీరా తండాలో రూ.పది లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ సర్కార్ కొత్త జీపీలను ఏర్పాటు చేసింది తప్ప ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని ఆరోపించారు. జగదాంబ తండా కార్యదర్శి అరవింద్ రెడ్డి, బట్టతండా మాజీ సర్పంచ్ రెడ్డి రాతల, కాంగ్రెస్ నాయకులు కిషన్ యాదవ్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట



భిక్కనూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని భిక్కనూరు ఎంపీపీ గాలిరెడ్డి అన్నారు. మంగళవారం తిప్పాపూర్‌లో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఎంపీటీసీ ద్యావర సాయిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొతంగల్ మండల కేంద్రం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం రాత్రి పట్టుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి ట్రాక్టర్లను పట్టుకున్నామని, చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

ప్రగతి.. అధోగతి

మున్సిపాలిటీల్లో మౌళిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. తొమ్మిది నెలలుగా నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలకు సుమారుగా రూ.6 కోట్లు రావాల్సి ఉంది.

- తొమ్మిది నెలలుగా విడుదలకాని 'పట్టణ ప్రగతి' నిధులు
- జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు విడుదల కావాల్సింది రూ.6కోట్లు
- పారిశుధ్య నిర్వహణకూ ఇబ్బందులే..
- నిలిచిన అభివృద్ధి పనులు



బాన్సువాడలో వాల్ పెయింటింగ్ వేయిస్తున్న దృశ్యం

బాన్సువాడ : పట్టణ ప్రగతి నిధులను జనాభా ప్రాతిపదికన కేటాయించి అత్యవసర పనులతోపాటు మౌళిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా ఇరుకు రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, పకృతి వనాలు, ఓపెన్ జిమ్, సమీకృత వెజ్–నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠ ధామాల నిర్మాణంతోపాటు ఉద్యానవనాలను తీర్చి దిద్దడం ద్వారా పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందించడం పట్టణ ప్రగతి ముఖ్య ఉద్దేశం. పథకం ప్రారంభించిన కొత్తలో నిధులు పక్కాగా విడుదలైనప్పటికీ ప్రస్తుతం నిలిచిపోయాయి.

మున్సిపాలిటీలకు అరకొర ఆదాయం

మున్సిపాలిటీలకు నల్లా కనెక్షన్, ఆస్తి, ఇతర పన్నుల ద్వారా సమకూరే ఆదాయం అరకొరగానే ఉంటోంది. పన్ను సకాలంలో వసూలుకాకపోవడం, ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల సృష్టికి అవకాశాలూ అంతంత మాత్రంగానే ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు విద్యుత్ దీపాలు, తాగునీటి పథకాల నిర్వహణ, వాటి విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, అత్యవసర ఖర్చులు నెలకు రూ.లక్షల్లో ఉంటున్నాయి. వీటి కోసం నెలవారీ ఆదాయాన్ని మించి ఖర్చు చేసే పరిస్థితి నెలకొంది. చివరకు సిబ్బంది, కార్మికుల వేతనాల చెల్లింపునకూ గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పట్టణ ప్రగతికి నెలవారీగా వెచ్చిస్తుండగా కొంత అక్కరకు వస్తున్నాయి. అయితే సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టడం ఇబ్బందిగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.

నిధుల కోసం ఎదురు చూపులు

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలకు 9 నెలలుగా సుమారు రూ.8 కోట్లు విడుదల కావాల్సి ఉంది. కామారెడ్డి మున్సిపాలిటీకి ప్రతి నెలా రూ.54 లక్షల చొప్పున సుమారు రూ.4 కోట్లు, బాన్సువాడ మున్సిపాలిటీకి రూ.13.43 లక్షల చొప్పున రూ.1.20 కోట్లు, ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి రూ.7.24 లక్షల చొప్పున రూ.95 లక్షలు విడుదల కావాల్సి ఉంది. నిధుల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

ఇబ్బందులు ఎదురవుతున్నాయి

పట్టణ ప్రగతి నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. పట్టణ ప్రగతి నిధులు సకాలంలో విడుదలైతే అన్ని రకాల పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయి.

– రమేశ్, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

వేల్పూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని ఎంపీ ధర్మపురి అర్వింద్ మంగళవారం పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, రెండు వర్గాల మధ్య జరిగిన సంఘటనల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివాదాస్పద స్థలం విషయంలో పోలీసులు ఓ వర్గానికి వత్తాసు పలికారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి 50 ఫీట్లు వదిలి నిర్మాణం చేయాల్సి ఉండగా, స్థలం వదలకుండా నిర్మాణం చేపట్టారన్నారు. దానిని వ్యతిరేకించిన 40 మంది గ్రామస్తులపై పోలీసులు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. అధికారులు, పోలీసులు ఒకే వర్గానికి కొమ్ముకాస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మల్కన్నగారి మోహన్‌రెడ్డి, ఏలేటి రమేశ్‌రెడ్డి, బద్దం రాజారెడ్డి, మాజీ సర్పంచ్ తీగెల రాధామోహన్, ఎంపీటీసీ మొండి మహేశ్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం, గ్రామస్తులున్నారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పోతాయిపల్లి పద్మ (43) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. వివరాలు.. పోతాయిపల్లి పద్మ ఈనెల 11న రాత్రి ఇంట్లో గొడవపడి 12న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిందని, రాత్రి వరకు తిరిగి రాక పోవడంతో 13న కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు.

వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం



మాచారెడ్డి: మండల కేంద్రంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమని మాచారెడ్డి గ్రామస్తులు కొనియాడారు. అక్కాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల లక్ష్మీనరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ జబ్బులతో పాటు దంత, నేత్ర వైద్య నిపుణులతో మొత్తం 500 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. తల్లిదండ్రుల పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్టు ఛైర్మన్ నర్సింహారెడ్డిని పలువురు అభినందించారు.

ప్రేమిస్తే.. ఊరి నుంచి గెంటేశారు

- మూడేళ్లు పస్తులున్నారు
- ఇప్పుడు ఇద్దరు పిల్లలు





ఆకాష్, అశ్విని దంపతులు

నిజాంసాగర్: ఐదేళ్ల నుంచి వెంట పడ్డా.. నా ప్రేమను గుర్తించి ఏడాదికి ప్రేమ పెళ్లికి ప్రియురాలు అంగీకరించింది. కులాలు వేరు కావడంతో ఇరు కుటుంబాలతో పాటు గ్రామస్తులు ఊరి నుంచి గెంటేశారు. ప్రేమను కాదనలేక కన్నీళ్లు తుడ్చుకుంటూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 2013లో ప్రేమ పెళ్లి చేసుకుని మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన మల్లయ్యగారి అశ్విని, ఆకాష్ దంపతులు ప్రేమికులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రేమ పెళ్లి చేసుకున్న తర్వాత మూడు సంవత్సరాల పాటు రోజుకు ఒక పూట భోజనం చేసిన రోజులున్నాయి. స్నేహితుల సహకారంతో కుటుంబపోషణ, ఉన్నత చదువులు చదుకున్నాం. ఇద్దరం ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం కుటుంబపోషణతో పాటు పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయి. ఇళ్ల నుంచి వెళ్లగొట్టిన వారు ఇప్పుడు ఇంటికి రమ్మని పిలవడంతో బంధువులతో కలిసి ఉంటున్నాం.

పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం



భార్యభర్తలు విజయ, సాయిరెడ్డి

తాడ్వాయి: పెద్దలను ఒప్పించి 1989లో పెళ్లి చేసుకున్నామని కన్కల్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు విజయ, నల్లవెల్లి సాయిరెడ్డి అన్నారు. ప్రేమించి పెళ్లి చేసుకోవడం ద్వారా ఒకరినొకరం అర్థం చేసుకోగలిగామని, జీవితాన్ని ఆనందంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. గ్రామస్తులు మా ఇద్దరిని ఆదర్శంగా తీసుకుంటారు. ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం కాదు ప్రియురాలు అంతా సున్నితం అనే సామెత ఉండాలి అంటారు సాయిరెడ్డి. సాయిరెడ్డి రాజకీయాలంటే ఇష్టం. గతంలో దేమికలాన్ సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. వారికి ఇద్దరు కుమారు. ఒకరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మరొకరు లండన్‌లో చదువుతున్నారు.

ప్రేమ పెళ్లితో ఆనందంగా ఉన్నాం



కులాంతర వివాహం చేసుకున్న భరత్, సంధ్య

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రేమ పెళ్లి చేసుకుని ఆనందంగా ఉన్నామని మండల కేంద్రానికి చెందిన భరత్, సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రానికి చెందిన వీరి కులాలు వేరు కావడంతో ఇరువైపులా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. అయినా తల్లిదండ్రులను ఎదిరించి మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకుని వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు భరత్, సంధ్యారాణి దంపతులు. వారి ప్రేమకు గుర్తుగా ఏడాది క్రితం బాబు పుట్టాడు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని ఐఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ రాజేందర్ రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని భూంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన మాదకద్రవ్యాల వినియోగం నేడు గ్రామాలకు వచ్చిందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థులు, యువత, కుటుంబ సభ్యులు తమ ఉజ్వల భవిష్యత్తును ఇబ్బందికర పరిస్థితులలోకి తీసుకెళ్తున్నారన్నారు. ఈ వ్యసనాల వల్ల కుటుంబాలకు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. బాలికలకు సమస్యలు ఎదురైతే 1930, 1098, 181 నంబర్లకు సంప్రదించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు చేసే ఫోన్‌లకు స్పందించవద్దన్నారు. ఫోన్‌లకు వచ్చే లింక్‌లను కూడా ఓపెన్ చేయవద్దని సూచించారు. సంస్థ ప్రతినిధులు రవళి,ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరికి డ్రంకెన్ డ్రైవ్‌లో రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రతాప్ మంగళవారం రెండు రోజుల పాటు జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపినందున జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

అదృశ్యమైన పాఠశాల కరస్పాండెంట్ ఆచూకీ లభ్యం

భిక్కనూరు: కనిపించకుండా పోయిన భిక్కనూరు మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి ఆచూకీ లభ్యమైనట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఇంటి నుంచి ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోవడంతోపాటు ఆయన సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటం, ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య సంధ్యారాణి భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదృశ్యం కేసును నమోదు చేశారు. మంగళవారం విజయభాస్కర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని, వివరాలు తెలుసుకుంటున్నామని ఎస్సై వివరించారు.

ముగ్గురు పేకాట రాయుళ్ల అరెస్ట్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని రామేశ్వర్‌పల్లి వద్ద ఓ ఖాళీ స్థలంలో పేకాడుతున్న ముగ్గురు పేకాట రాయుళ్లను దేవునిపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,240 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

భాగిర్తిపల్లిలో చోరీ

- నాలుగు తులాల బంగారం, 29 తులాల వెండి అపహరణ



పరిశీలిస్తున్న సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: భాగిర్తిపల్లిలో మంగళవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు ఒక ఇంట్లో చొరబడి బంగారం, వెండిని అపహరించుకెళ్లారు. గ్రామానికి చెందిన నీల కుమార్‌కు గ్రామంలో రెండిళ్లు ఉన్నాయి. ఆయన తన భార్య కుమారుడితో కల్సి ఆదివారం కొత్త ఇంటికి వెళ్లి అక్కడ తన భార్య, కుమారుడికి సంబంధించిన నాలుగు తులాల నాలుగున్నర గ్రాముల బంగారం, 29 తులాల రెండు గ్రాముల వెండిని ఇంటి బీరువాలో పెట్టి తాళం వేసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. తిరిగి సాయంత్రం పాత ఇంటికి వచ్చి అక్కడే పడుకున్నారు. సోమవారం వేకువజామున ఇంటి తాళం పగులగొట్టి ఉన్న విషయం గ్రామస్తులు గుర్తించి కుమార్‌కు సమాచారం అందించారు. కొత్త ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో భిక్కనూరు పోలీసులకు సమాచామిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. వేలి ముద్ర నిపుణులను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ.. దొంగలను వెంటనే పట్టుకుంటామన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని దేవీ విహార్‌కాలనీ వద్ద టీవీఎస్ ఎక్సెల్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో తాడ్వాయి మండలం దేవాయిపల్లికి చెందిన బుయ్య మల్లయ్య(51) మృతి చెందాడు. మంగళవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లయ్య(51) ఆస్పత్రి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కామారెడ్డికి వస్తుండగా, దేవీవిహార్ వద్ద వెనుక నుంచి అతివేగం, అజాగ్రత్తగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి ఎస్సై రాజు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

మృతుడి బంధువుల ఆందోళన

ప్రమాద విషయం తెలుసుకుని దేవాయిపల్లి నుంచి మృతుని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అజాగ్రత్తగా వాహనం నడిపి మల్లయ్య మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేసేందుకు రోడ్డుపై బైఠాయించగా, ఎస్సై రాజు వారిని సముదాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అక్కడ నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టుకు ఢీకొని యువకుడి మృతి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): చెట్టుకు బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మీసాన్‌పల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. వివరాలు..సదాశివనగర్ మండలంలోని వడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జడల నరేష్ తన అత్తగారింటికి ఈనెల 12న ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్ గ్రామానికి బయలు దేరారు. 12న రాత్రి సమయంలో నరేష్ తన బైక్‌పై బావమరిది అరవింద్‌ను తీసుకుని వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు ఆయన తెలిపారు. ప్రమాదంలో గాయపడిన ఇరువురిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నరేష్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటమునిగి ఒకరి మృతి



నర్సింలు (ఫైల్)

కామారెడ్డి క్రైం: చేపలు వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిన్నమల్లారెడ్డికి చెందిన బాల్‌నర్సింలు (33) చేపల వేట, కూలీ పనులకు వెళ్లేవాడు. ఎప్పటిలాగే ఆదివారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు పక్కనే ఉన్న కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం చెరువు ప్రాంతంలో గాలించగా, ఒడ్డుపై చెప్పులు, దుస్తులు, సెల్‌ఫోన్ లభించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మృతదేహం నీటిపై తేలడంతో పోలీసులు బయటికి తీయించి విచారణ చేపట్టారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

ధర్పల్లి: మండలంలోని మైలారంలో మూడు రోజులక్రితం గ్యాస్ లీకైన ఘటనలో వృద్ధ దంపతులు తీవ్రగాయాలపాలైన విషయం తెలిసిందే. 90శాతం గాయాలతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేండ్ల రాజన్న(69) పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



నిజాంసాగర్(జుక్కల్): ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ గేటు వద్ద మంగళవారం రాత్రి బోల్తాపడింది. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా లారీ నడుపడటంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్‌ను స్థానికులు క్యాబిన్ నుంచి బయటకు తీసి 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నిజాంసాగర్ పోలీసులు వివరాలు సేకరించారు. ధాన్యం బస్తాలను ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే సమాచారం తెలియలేదు.

బస్సును ఢీకొన్న బైక్

- ఒకరికి తీవ్రగాయాలు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బర్ధిపూర్ శివారులో డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా రెడ్డిపేట్‌కు చెందిన సుధాకర్‌తోపాటు మరికొందరు మూడు బైక్‌లపై నిజామాబాద్‌కు వచ్చారు. గల్ఫ్ నుంచి వచ్చిన బంధువును వెంటబెట్టుకొని తిరిగి రెడ్డిపేట్‌కు బయల్దేరారు. కామారెడ్డి డిపో ఆర్టీసీ బస్సు బర్ధిపూర్ శివారులో సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకాలే ఉన్న సుధాకర్ బైక్ బస్సు వెనుకభాగాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సుధాకర్‌కు తీవ్రగాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని వాజీద్‌నగర్‌లో 2022 డిసెంబర్ 9న అంజవ్వ అనే మహిళ హత్య జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కుమ్మరి చిన్నబాలయ్య మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతూ డబ్బుల కోసం భార్య అంజవ్వను వేధించేవాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వకపోవడంతో గొడ్డలితో దాడిచేసి అంజవ్వను హతమార్చాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్షపడటంలో కృషి చేసిన అదనపు పీపీ నంద రమేశ్, సీఐలు కృష్ణ, నరేష్, ఎస్సై విఠల్, హెడ్ కానిస్టేబుళ్లు విక్రమ్‌రెడ్డి, గోపి, హన్మాండ్లును ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

భారతిది ఆత్మహత్య కాదు.. హత్య

- పోలీసులకు ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని భారతిది ఆత్మహత్య కాదని, అది హత్యేనని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ మాట్లాడుతూ.. భారతిని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, ఆమె హత్య వెనుక కన్నతండ్రితోపాటు కుటుంబ సభ్యుల పాత్ర ఉందని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి పూడ్చిపెట్టారన్నారు. లోతుగా దర్యాప్తు చేయాలని ఎస్సై కొండ విజయ్‌ని కోరారు. అనంతరం బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మౌనం పాటించి పాఠశాలను బంద్ చేయించారు. భారతికి న్యాయం జరిగే వరకు ఏబీవీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్, జిల్లా ఖేల్ కన్వీనర్ రోహిత్, కార్యకర్తలు కళ్యాణ్, వెంకీ, అల్తాఫ్, మురళి తదితరులు పాల్గొన్నారు.